# న భూతో న భవిష్యతి 'కేబరే'

కంట్రాక్టర్ కన్నం నాయుడుగారు జీపు దిగారు. సూపర్‌వైజర్ సాయంతో కుంటుకుంటూ లోపలికి వచ్చారు.

"కాలు జారారా?" అనడిగాను.

"కాలు రోజూ జారుతూనే వుంటాం. ఈ సారే బెణికింది" అన్నారు కన్నం నాయుడు గారు చుట్ట వెలిగించి.

"ఏమైంది? ఎలాగుంది" అనడిగాను ఆయన వాచిపోయిన కాలు పరీక్ష చేస్తూ.

"పెద్ద ఇంజనీర్ గారు వచ్చారు. ఆరి గవురార్థం పార్టీ పెట్టాం. అదే మన సన్ను అండు సాండు హోటేల్లోనే! అసలే పారిన్ ఇస్కీ. దాని మీద రొయ్య పకోడీలు. మరి చెప్పాలా! ఇంతలో కాబిరెట్టు ఒగ్గాడు. ఇద్దరూ నక్షత్రాలాంటి గుంటలే! రెండు రెళ్ళు నాలుగు. ఒకటే లబలబ! అబ్బబ్బ ఇదిగో డాక్ట్రూ చూడాలిగాని వొర్నించలేను. నువ్వెప్పుడైనా కాబిరెట్టు చూశావా? పోసె రికార్డింగు డాన్సు కాబి"రెట్టులో ఆ గుంటు ఒక్కొక్క బట్టా ఇప్పేస్తూ మన దగ్గర కొస్తుందిలే! నిన్న దాన్నట్టుకుందారని వెనకాలే ఎల్లబోయి జారిపోయాను. సర్దార్జీ జోకు కాదు. నిజంగానే! కాలు బెణికింది. ఇయ్యాల నువ్వుకూడా రా! చివర చివర్ని హుషారెక్కిపోయి తల ప్రాణం తోకకి వస్తుంది" అని చెప్పసాగారు కంట్రాక్టర్ గారు.

"ఇక్కడ నొప్పిగా వుందా" అనడిగాను మడమ నొక్కుతూ.

"నొప్పిగానే వుంది. ఫోటో తీస్తావో, కరెంటు పెడతావో, ఇంజీషన్ ఏస్తావో నా తలిస్తావో గురో రెండు పెగ్గుల మందిస్తావో నాకు తెల్దు. రేత్రికి మళ్ళీ ఇంజనీరుగార్ని కేబిరెట్టుకి తీసుకెళ్ళాల" అన్నారు

## స్వాగతంబు

కన్నంనాయుడుగారు. "ఎక్స్‌రే తీశాను. ఫ్రాక్చర్ లేదు. మర్దనాలు కాపడాలు వద్దు. ఈ మాత్రలు వేసుకుని మూల కూర్చోండి" అన్నాను.

"ఇదిగో డాక్ట్రూ? ఆ హోటేల్లో మనం ఏమూల కూకున్నా ఆ కేబిరెట్టు గుంట ఎదుక్కుంటూ వచ్చేసి నావొళ్ళో కూర్చుని నా బట్టతల తడిమి. మీసాలు మెలిదిప్పి నా బుగ్గమీద చిటికేసి ఎల్లద్ది. కొత్తదైతే తొలి రోజుని- హావుమచ్చి- అనడుగుతాను అంతే.



బెల్లీ డాన్సర్ రాధికా

మళ్ళీ మనతో చేరాలుండవు. నిన్న ఇంజనీరుకి మతిపోయింది. మరో రెండు రోజులు ఈ వూళ్ళోనే కేంప్ అన్నాడు. ఇయ్యాల నువ్వు కూడా రా" అని ప్రేమగా ఆహ్వానించారు.

"అలాగే" అన్నాను.

"అలాగంటే కుదరదు. రాకపోతే గొడవయిపోద్ది" అని వెళ్ళిపోయారు.

నేను సాయంత్రం వెళ్ళలేదు.

రాత్రి ఫోను మోగింది కన్నం నాయుడు గార్కి చాలా ప్రమాదంగా వుంది. అర్జంటుగా రమ్మని కబురు.

నేను తయారయేసరికి జీపు వచ్చింది.

జీప్ ఎక్కాను. వాయు వేగంతో జీప్ వెళ్ళి సన్ అండ్ సాండ్ హోటల్ దగ్గర ఆగింది.

"ఇక్కడికి తీసుకొచ్చావేమిటి?" అని డ్రైవర్‌ని అడిగారు.

"కంట్రాక్టర్‌గారు లోపలే వున్నారు.




పాటకు తగిన ఆట

పరిస్థితి బాపులేదు. తమరు తొందరగా లోపలికి వెళ్ళండి డాక్టర్ గారూ" అంటూ డ్రైవర్ నన్ను లోపలికి తీసుకెళ్ళాడు.

లోపల హాల్లో గుడ్డి దీపాల వెలుగులో వూళ్ళో వున్న పెద్ద మనుషులందరూ కిక్కిరిసి కూర్చున్నారు.

బాజాభజంత్రీలు చెవులు చిల్లులు పడేట్టు పాశ్చాత్య సంగీతాన్ని బాదుతున్నాయి. కామిని పిశాచంలా ఒక అమ్మాయి చిన్న బాడీలాంటిది, లాగు లాంటిది వేసుకుని స్పాట్‌లైట్ వెలుగులో వికృతంగా తన అంగాల అందాల్ని ప్రదర్శించి దానికి అనేక విన్యాసాలు చేస్తూ తిప్పలు పడుతోంది.

మత్తెక్కి మైమరచిన పెద్దలు కొందరు తప్పట్లు కొడుతున్నారు. మరికొందరు ఈలలు వేస్తున్నారు. కేబరె సుందరి ఒక్కొక్క బట్టని విప్పేస్తూ విస్కీతో వేడెక్కిపోయిన పెద్దలమధ్య తిరుగుతూ అందర్నీ పలకరిస్తూ పులకరింపచేస్తూ గుమ్మం దగ్గరే నిలబడిపోయిన నన్ను "హలో డాక్! హవ్వార్యూ" అని పలకరించింది.



అగ్ని నృత్యం చేస్తున్న రొక్సానా



కేబరే నర్తకి మోనా

ఆ అమ్మాయిని గుర్తుపట్టాను. ఆ అమ్మాయి ఇచ్చిన డబ్బులు ఆమెకి నేను పోగొట్టిన జబ్బులు జ్ఞాపకం వచ్చాయి. వెనక్కి తిరిగి వెళ్ళిపోదా మనుకున్నాను.

"ప్రాణాలు పోతున్నాయంటే గానీ నువ్వు రావు. ఇక్కడ నాకు తలప్రాణాలు తోకకి వస్తున్నాయి. ఆగు" అంటూ కన్నం నాయుడుగారు నన్ను పట్టుకొని ఒక కుర్చీలో కూర్చోపెట్టారు.

నన్ను చూసి వూర్లో పెద్ద మనుషులు సిగ్గుపడబోయి మానేశారు. నన్ను చూసుకొని నేనే సిగ్గుపడ్డాను.

సిగ్గు లేకుండా ఆ అమ్మాయి మాత్రం పెద్ద మనుషుల వినోదం కోసం ఇంకా వింత వింత విన్యాసాలు చేస్తూ వచ్చి కంట్రాక్టర్ గారి ఒళ్ళో కూర్చుంది.

"తప్పు తప్పు. పెద్దోళ్ళుండగా నానేటి" అంటూ ఇంజనీరుగార్ని చూపించారు కన్నం నాయుడుగారు. అమ్మాయి బుద్ధిగా వచ్చి ఇంజనీరుగారి వొళ్ళో కూర్చుంది. ఆయన ఈ లోకంలో లేరు. అసలు నాకు ఆ లోకమే వేరుగా కనిపించింది.

కట్టుకోడానికి బట్టలు లేక సగటు భారతీయులు అర్ధనగ్నంగా వుంటే ఈ అమ్మాయి ఈ పెద్దల సంతోషం కోసం వున్నబట్టలు విప్పేస్తోంది. ఈ సంస్కృతి, ఈ సంప్రదాయం మనవేనా? ఎక్కడ్నించైనా ఎరువు తెచ్చుకున్నామా!

ఇదే బూతు వీధుల్లో అయితే రికార్డింగ్ డాన్సు అని నిషేధిస్తున్నాం. పెద్దలకోసం కేబ్రే అంటూ వదలివేస్తున్నాం. నేను ఒక్క క్షణం కూడా వుండలేకపోయాను.

"అప్పుడే హీటెక్కిపోయావా? అసలు డాన్సు ముందుంది. ఈ బూతుల్లేకపోతే డాక్టర్లకి భవిష్యత్తు లేదు" అంటూ కన్నం నాయుడుగారు పిలుస్తూనే వున్నారు.

[నీతి :- నబూతో నభవిష్యతి! బూతు లేకపోతే జాతికి భవిష్యత్తు లేదు.]

—తంబు


తెలుగు పుస్తకాలు

జొన్నలగడ్డ లలితాదేవి

ఓ రాధ కథ రు. 6-00

భామినీ బ్రహ్మచారి రు. 5-00

న్యూస్టూడెంట్స్‌బుక్‌సెంటర్
బుక్‌సెంటర్
ఏలూరురోడ్డు...విజయవాడ 2. PHONE 74677